సాక్షి
తిరుపతి
శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



మహిళా వర్సిటీలో సక్సెస్ మీట్
తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో గురువారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. -8లో



జేటీసీ బాధ్యతల స్వీకరణ
తిరుపతి మంగళం: తిరుపతి రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా మల్లెపల్లి బసిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. -8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	38	26
చిత్తూరు	37	24
తిరుమల	33	21
గూడూరు	38	27
నగరి	38	26

న్యూస్‌రీల్

పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

తిరుపతి ఎడ్యుకేషన్: పాఠశాలల అభివృద్ధి, విద్యాప్రమాణాలు మెరుగుపర్చడంలో ప్రధానోపాధ్యాయుల పాత్రే కీలకమని కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ జి.సురేష్ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీజేఎస్‌ఎం పాఠశాలలో గురువారం సమగ్రశిక్ష, సీమ్యాట్ సంయుక్త ఆధ్వర్యంలో 'సమగ్ర పాఠశాల మూల్యాంకన విధానం–సామాజిక తనిఖీ, పర్యావరణ, సామాజిక వ్యవస్థల విధానాల అమలు'పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులే కీలకభూమిక పోషించాలని కోరారు. పాఠశాలల్లో నిర్వహించే సామాజిక తనిఖీపై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. విద్యాసంబంధిత అంశాల్లో వెనుకబడ్డ పాఠశాలలకు సత్వర పరిష్కారాలను చూపే దిశగా సోషల్ ఆడిట్ యాప్ దోహదపడుతుందని వివరించారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ



బాలాజీ నగర్‌ను సందర్శిస్తున్న జేఈఓ వీరబ్రహ్మం

తిరుమల: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో స్వచ్ఛందంగా అందరూ పాల్గొని మెరుగైన పారిశుద్ధ్యాన్ని అందించాలని జేఈఓ వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. గురువారం టీటీడీ ఎస్టేట్ ప్రత్యేకాధికారి మల్లికార్జున, ఇతర అధికారులతో కలిసి తిరుమల బాలాజీ నగర్‌ను ఆయన సందర్శించారు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ బాలాజీ నగర్, ఆర్‌బీ సెంటర్లను డివిజన్లుగా విభజించుకుని వలంటీర్లుగా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాపార సముదాయాల వద్ద, హాకర్లు, దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్ల వద్ద తడి, పొడి చెత్తను వేరుచేసి చెత్త లారీ వచ్చినప్పుడు మాత్రమే వారికి అందించాలని చెప్పారు. ఇలా నెల రోజుల పాటు స్వచ్ఛందంగా పారిశుద్ధ్య నిర్వహణ చేసుకునేలా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. టీటీడీ రెవెన్యూ ఏఈఓ నారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

30న ఏకలవ్య మోడ్రన్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడ్రన్ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల ప్రవేశాలకు సంబంధించి ఈ నెల 30వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 7, 8, 9 తరగతుల్లో ఉన్న బ్యాక్‌లాగ్ ఖాళీలకు గిరిజన బాలబాలికలు మాత్రమే అర్హులని ఆయన పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 63,382 మంది స్వామివారిని దర్శించుకోగా.. అందులో 27,478 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.25 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తిచేసిన వారు ఆర్టీసీలో కాల్ డ్రైవర్స్‌గా (రోజు వారీ వేతనం ప్రాదిపదికన) దరఖాస్తు చేసుకోవచ్చని డీపీటీఓ చెంగల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆ మేరకు తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, జిల్లా ప్రజాసమాచార అధికారి పార్థసారథిని కలిసి ఒరిజనల్ లైసెన్స్‌ను చూపాలని వివరించారు.

1 నుంచి సమ్మర్ హాబీ క్యాంప్

తిరుపతి కల్చరల్: రీజనల్ సైన్స్ సెంటర్‌లో మే 1 నుంచి జూన్ 10వ తేదీ వరకు సమ్మర్ హాబీ క్యాంప్ ఉంటుందని కో ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. ఈ క్యాంప్‌లో ఫిజిక్స్, బయోసైన్స్, ఎలక్ట్రానిక్స్, రోబొటిక్స్, ఆస్ట్రానమీ, కెమిస్ట్రీ వంటి వివిధ సబ్జెక్టులపై శిక్షణ ఉంటుందన్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. వివరాలకు 0877- 2286202, 7989694681లో సంప్రదించాలని కోరారు. క్యాంప్‌లో చేరదలిచిన విద్యార్థులు https://tinyurl.com/CAC23RSCTapp లింక్‌ని ఉపయోగించి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

ప్రయాణం.. ప్రశాంతం

మండే ఎండల్లో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను సౌకర్యవంతంగా శ్రీవారి చెంతకు చేర్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆర్టీసీకి దిక్సూచి కానుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రయాణికులకు మెరుగైన వసతులు అందించాలన్న లక్ష్యంతో అలిపిరి డిపో కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఏడాది సెప్టెంబర్ 27న విద్యుత్ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. మన అవసరాలకు ఈ బస్సులు చక్కగా సరిపోతాయని ఈ ఆరు నెలల్లో నిర్ధారించుకున్న తర్వాత తిరుపతి నుంచి మరో 224 బ్యాటరీ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించుకుంది.





అలిపిరి డిపోలో విద్యుత్ బస్సులు

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యుత్ బస్సులు
- ప్రమాదాలకు దూరంగా అత్యాధునిక పరికరాలు
- శ్రీవారి భక్తుల కోసం వంద బస్సులు
- తిరుపతి నుంచి మరో 224 విద్యుత్ బస్సులు నడిపేందుకు చర్యలు
- రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్సు డిపోగా అలిపిరి

ఏపీ నెట్‌వర్క్ :

బ్యాటరీతో నడిచే బస్సు ఖరీదు ఒక్కోటి రూ.2 కోట్లకు పైమాటే. ఒకేసారి పెద్దమొత్తంలో బస్సుల కొనుగోలుకు ఆర్టీసీకి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని ప్రవేశ పెడుతోంది. ప్రస్తుతం 12 ఏళ్లపాటు వంద బస్సులు నడిపేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇప్పటికే 95 బస్సులు తిరుపతికి చేరుకున్నాయి. వీటిలో 50 తిరుమలకు, మరో 14 రేణిగుంట విమానాశ్రయానికి నడుస్తున్నాయి. మిగిలిన 31 బస్సులు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉన్నాయి. మరో ఐదు బస్సులు రావాల్సి ఉంది. ఒక్కో విద్యుత్ బస్సు ద్వారా కి.మీకు రూ.90 ఆదాయం వస్తుంది. అందులో రూ.58 ప్రైవేటు ఆపరేటర్‌కు చెల్లిస్తారు. మిగిలిన రూ.32 ఆర్టీసీకి చెందుతుంది. బస్సు డ్రైవర్ జీతభత్యాలను ప్రైవేటు ఆపరేటర్ భరిస్తారు. కండక్టర్లు, లోడింగ్ కంట్రోలర్లు, చార్జింగ్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది వేతనాలతో పాటు విద్యుత్ చార్జీలను ఆర్టీసీ భరించాల్సి ఉంటుంది. నిర్వహణ, చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు, రిపేర్లు తదితరాలు ప్రైవేటు ఆపరేటర్లదే బాధ్యత. 12 ఏళ్ల తర్వాత కొత్త సర్వీసులు ఏర్పాటు చేయాలి. మూడేళ్లకు ఒకసారి బ్యాటరీలు మార్చు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 50 సర్వీసులు ఇప్పటివరకు 3.5 లక్షల కిలోమీటర్లు తిప్పారు.

చార్జీలో తేడా..

సాధారణ బస్సులకు, ఏసీ విద్యుత్ బస్సులకు చార్జీ విషయంలో కేవలం రూ.30 మాత్రమే తేడా ఉండడంతో అంతా విద్యుత్ బస్సులో ప్రయాణించేందుకే ఆసక్తి చూపుతున్నారు. 36 సీట్లతో ఉన్న విద్యుత్ బస్సులో మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ప్రయాణికులు తొలి ప్రాధాన్యత విద్యుత్ బస్సులకే ఇస్తున్నారు. విద్యుత్ బస్సులు నడిపేందుకు 120 మంది డ్రైవర్లను ఎంపిక చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 70 మంది డ్రైవర్లు పని చేస్తున్నారు. సాధారణ బస్సులతో పోలిస్తే విద్యుత్ బస్సు నడపడం సులభంగా ఉందని డ్రైవర్లు చెబుతున్నారు.



శ్రీవారి పాదాల చెంతనే తొలి విద్యుత్ బస్టాండ్

రాష్ట్రంలో తొలి విద్యుత్ బస్టాండ్‌ను వెంకన్న పాదాల చెంత అలిపిరిలో ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని డిపో మేనేజర్ హరిబాబు తెలిపారు. వారం క్రితం మరో 224 బస్సులను మంజూరు చేశారని ఆయన చెప్పారు. టెండర్ల ప్రక్రియ ముగిసిన వెంటనే ఆపరేటర్లను ఎంపిక చేస్తారని, కొత్తగా వచ్చే బస్సులను చుట్టుపక్కల ఉన్న పుణ్యక్షేత్రాలను కలిపేలా నడిపేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు తిరుపతి నుంచి బెంగుళూరు, చెన్నై, విజయవాడ, విశాఖపట్టణం మధ్య సైతం నడిపేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త బస్సులను తిరుపతి మంగళం డిపో కేంద్రంగా ఆపరేట్ చేస్తారని ఆయన చెప్పారు.

ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్లు



విద్యుత్ బస్సుల్లో ఉపయోగించే బ్యాటరీల చార్జింగ్ కోసం అలిపిరి డిపోలో 45, తిరుపతి బస్‌స్టాండ్‌లో 10 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. మరో 60 చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో సగం ఫాస్ట్ చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి. ఫాస్ట్ చార్జింగ్ పాయింట్ల ద్వారా కేవలం 1.20 గంటల సమయంలోనే పూర్తిగా చార్జింగ్ అవుతుంది. సాధారణ చార్జింగ్ పాయింట్ల ద్వారా అయితే 3.20 గంటల సమయం పడుతుంది. ఒక బస్సులో ఉపయోగించే బ్యాటరీలు పూర్తిగా చార్జింగ్ చేస్తే 180 కి.మీ. ప్రయాణం చేయవచ్చు. ఒక బ్యాటరీ సుమారు మూడేళ్ల వరకు పనిచేస్తుంది. ఆ తర్వాత బ్యాటరీ మార్చాల్సి ఉంటుంది.

అత్యాధునిక టెక్నాలజీతో విద్యుత్ బస్సు





మామూలు బస్సులకు గేర్ సిస్టం ఉంటుంది. ప్రతి టర్నింగ్‌లో గేర్ మార్చుకోవాల్సి ఉంటుంది. విద్యుత్ బస్సులో గేర్లు ఉండవు. ఎంత వేగంగా వెళ్తున్నా వెంటనే కంట్రోల్ చేసే సిస్టం ప్రత్యేకం. డ్రైవింగ్‌లో లోపాలను సైతం బస్సులోని టెక్నాలజీ గుర్తించి హెచ్చరికలు చేస్తుంది. బస్సు చుట్టుపక్కల ప్రాంతాలన్నింటినీ డ్రైవర్ సులభంగా గమనించేలా మిర్రర్స్, కెమెరాలు ఉంటాయి. అసలు శబ్దమే లేని మోటారు, సౌకర్యవంతమైన సీట్లు, కుదుపులు లేని ఎయిర్‌కండిషన్డ్ వాతావరణంలో ప్రయాణం ప్రజలకు మంచి అనుభూతినిస్తోంది.

కాలుష్య నివారణకు విద్యుత్ బస్సులు



శబ్ద, వాయు కాలుష్య నివారణ కోసం ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి–తిరుమలకు ఎంపిక చేసింది. ఆ మేరకు అలిపిరి డిపో నుంచి ఆపరేట్ చేస్తున్నాం. అదనంగా మరో 224 విద్యుత్ బస్సులు రానున్నాయి. వాటిని మంగళం డిపోతో పాటు జిల్లాలో అవసరం అయిన చోట నుంచి ఆపరేట్ చేస్తాం. తిరుమల కొండతో పాటు రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు, మదనపల్లి, నెల్లూరు, కడపకు తిరుపతి నుంచి సర్వీసులు ఏర్పాటు చేయనున్నాం.

–చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి, తిరుపతి

విద్యుత్ బస్సులతో ప్రమాదాల నివారణ



తిరుమల ఘాట్‌రోడ్డులో సాధారణ బస్సులతో పోల్చుకుంటే విద్యుత్ బస్సుల డ్రైవింగ్ సులభంగా ఉంది. అత్యాధునిక టెక్నాలజీతో ఆపరేటింగ్ సిస్టమ్ ఉంది. దీంతో ప్రమాదాలను అరికట్టవచ్చునని భావిస్తున్నాం. అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ డ్రైవింగ్ శిక్షణ పొంది సర్టిఫికెట్ పొందిన వారికి విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా అవకాశం కల్పిస్తున్నారు. దీంతో పలువురికి ఉపాధి లభిస్తోంది.

–భగవాన్, డ్రైవర్

రాష్ట్రంలో వివక్ష లేని పాలన

- ప్రజాశ్రేయస్సే ప్రభుత్వ ఎజెండా
- రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- 42 మందికి కారుణ్య నియామక పత్రాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

శాంతిపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వివక్ష లేని పాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ గనులు భూగర్భ వనరులశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. కుప్పం పర్యటనలో భాగంగా సొన్నేగానిపల్లిలో గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజల శ్రేయస్సే ఎజెండాగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి చెప్పారు. గతంలో జన్మభూమి కమిటీలు దోచుకుతిని అర్హులకు అన్యాయం చేశాయన్నారు. ఇప్పుడు పేదరికమే కొలమానికంగా తీసుకుని ప్రతి ఒక్కరికీ పథకాలను వలంటీర్ల ద్వారా ముంగిట్లోనే అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 40 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. రైతుల కోసం రూ.3వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఓట్ల కోసమే పథకాలను తెచ్చిన ప్రభుత్వాలు ఉంటే ఇప్పుడు ఓటు హక్కు లేని పిల్లల కోసం సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు తెచ్చారని చెప్పారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు రూపు మారాయన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, నాడు–నేడు లాంటి పథకాలు అమలవుతున్నాయని అన్నారు.

మోసాల బాబు

ప్రజలను, నమ్మిన వారిని మోసం చేయటం చంద్రబాబుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదని మంత్రి చెప్పారు. 2014 ఎన్నికల కోసం డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే మోసం చేశారని గుర్తు చేశారు. మళ్లీ ఎన్నికలు రాగానే పసుపుకుంకుమ అంటూ రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని చెప్పారు. కానీ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట తప్పకుండా నాలుగు విడతల్లో 26 వేల కోట్లను డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు రుణమాఫీగా చెల్లిస్తున్నారని అన్నారు. కుప్పం ప్రజల ఓట్లతో ఎన్నో పదవులు పొందిన చంద్రబాబు ఇక్కడి ప్రజలకు కూడా న్యాయం చేయలేదని చెప్పారు. కుప్పం ప్రజలు ఈ తేడాను గమనించి స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు పట్టం కట్టారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపిస్తే తనను మంత్రిగా చేస్తామని సీఎం జగన్ మాట ఇచ్చారని గుర్తుచేశారు. సొన్నేగానిపల్లి మీదుగా తారు రోడ్డు మరమ్మతులకు అధికారులను వెంటనే ఆదేశిస్తామని చెప్పారు.


42 మందికి కారుణ్య నియామకాలు

జిల్లా పరిషత్‌లో వివిధ హోదాల్లో పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులు 42 మందికి కారుణ్య నియామకాల ఉత్తర్వులను మంత్రి అందించారు. గతంలో జెడ్పీలో పనిచేస్తూ మృతి చెందిన వారికి జెడ్పీలోనే ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా మంత్రి చొరవతో ఇతర శాఖల్లోనూ నియామకాలు చేశారు. జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీటీసీ శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు పెద్దన్న, కృష్ణమూర్తి, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి ఉజ్వల భవిష్యత్తు

- డాక్టర్ మిను బాజ్‌పాయ్ వెల్లడి
- ఘనంగా స్విమ్స్ వార్షికోత్సవం





మాట్లాడుతున్న డాక్టర్ మిను బాజ్‌పాయ్, టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి

తిరుపతి కల్చరల్: రానున్న రోజుల్లో వైద్యరంగానికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఈ నేపథ్యంలో పీజీ సీట్లను పెంచి స్పెషాలిస్టులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ మెడికల్ సైన్సెస్ న్యూఢిల్లీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మినుబాజ్‌పాయ్ తెలిపారు. గురువారం మహతి కళాక్షేత్రంలో స్విమ్స్ యూనివర్సిటీ 12వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రోజురోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మానవ వనరులను పెంచుకోవాలన్నారు. గత 30 ఏళ్లుగా స్విమ్స్ యూనివర్సిటీ వైద్య, విద్యారంగంలో సాగిస్తున్న కృషిని కొనియాడారు. దేశంలో సుమారు 15 లక్షల మంది మెడికల్ స్పెషలిస్టుల కొరత ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రులు విరివిగా ఏర్పాటు చేసి ఎంబీబీఎస్, పీజీ సీట్లను పెంచుతున్న నేపథ్యంలో స్పెషలిస్టుల కొరత తీర్చడానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రస్తుతం దేశంలో 612 మెడికల్ కళాశాలల్లో 91,925 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయని, సుమారు 2లక్షల మంది మెడికల్ గ్రాడ్యుయేట్లు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. వైద్యుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు ఎన్‌బీఈఎంఎస్ దేశవ్యాప్తంగా శాటిలైట్ స్కిల్ సెంటర్స్‌ను, వైద్యవిద్య బోధనా రంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం టీటీడీ చైర్మన్, స్విమ్స్ చాన్సలర్ వైవీ.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత సంస్థగా స్విమ్స్‌ను తీర్చిదిద్దుతామన్నారు. దేశంలోనే అతి పెద్ద హీమోడయాసిస్ సెంటర్ కలిగి, శ్రీపద్మావతి మహిళా ఆస్పత్రి విశిష్టమైన సేవలు అందిస్తోందని గుర్తుచేశారు. టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ స్విమ్స్ ఆసుపత్రిలో హాస్టల్ విద్యార్థినీవిద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎంబీబీఎస్, యూసీ, పీజీ, నర్సింగ్, ఫిజియోథెరిపీ, పారామెడికల్ డిప్లొమా కోర్సులు పూర్తిచేసిన 476 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. టీటీడీ జేఈఓ సదాభార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ ముఖ్య అతిథి డాక్టర్ మిను బాజ్‌పాయ్‌ని ఘనంగా సత్కరించారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడిమోహన్, రిజిస్ట్రార్ అపర్ణ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు.

ఓపికతో వైద్య పరీక్షలు చేయించుకోండి

- అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాం
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి

పాకాల : ప్రజలందరూ ఓపికతో వైద్య పరీక్షలు చేయించుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం మెడికల్ క్యాంప్ రెండవరోజు దామలచెరువు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచే వైద్య పరీక్షల నిమిత్తం రక్త సేకరణ, బీపీ, ఈసీజీ వంటి పరీక్షలతో పాటు 43 వైద్య పరీక్షలను ప్రారంభించారు.

అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

మెడికల్ క్యాంప్‌లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై దిశానిర్దేశం చేశారు. వైద్య పరీక్షలకు వచ్చే వారికి ప్రాథమిక సమాచారాన్ని తెలిపే స్లిప్పులు రాసి వారికి అవసరమైన కౌంటర్ వద్దకు పంపించాలని, దానికి తగిన ఏర్పాట్లను దగ్గరుండి పరిశీలించాలన్నారు. వైద్య పరీక్షల కోసం వచ్చే వారికి అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు.

ఏర్పాట్లు భేష్

మెడికల్ క్యాంప్‌నకు వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్టు ఎమ్మెల్యే చెవిరెడ్డి తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే ఆటోలు వెళ్లి సురక్షితంగా ప్రజలను మెడికల్ క్యాంప్‌కు తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. వైద్యపరీక్షల అనంతరం వారిని మళ్లీ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో వారివారి స్వగృహాలకు చేర్చుతున్నామన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో చలువ పందిళ్లు, నిల్చునే ఓపికలేని వారి కోసం కుర్చీలు సమకూర్చినట్టు తెలిపారు.

రక్త పరీక్ష కేంద్రాల పరిశీలన

రక్త పరీక్షా కేంద్రాలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, డ్వామా డీఆర్‌డీఓ సుశీలాదేవి పరిశీలించారు. రోగ నిర్ధారణ తర్వాత 104 సిబ్బంది, డాక్టర్ల పర్యవేక్షణలో మందులు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తుడా వీసీ హరికృష్ణ, తుడా సెక్రటరీ లక్ష్మి, ఎస్‌డీసీ.భాస్కర్‌నాయుడు, తిరుపతి డివిజన్ పీఓ రూపారాణి, ఎంపీడీఓలు రమేస్‌బాబు, వెంకటనారాయణ, అమర్‌నాథ్, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీపీ లోకనాథం, సర్పంచ్ సునీత పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమాభివృద్ధికి జేజేలు

- గడపగడపకు మహా పాదయాత్రలో జన నీరాజనం
- భాకరాపేట ఘాట్ రోడ్డు నుంచి దేవరకొండ వరకు భారీ బైక్ ర్యాలీ



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి హారతులు పడుతున్న మహిళలు



భాకరాపేట ఘాట్ రోడ్డు నుంచి స్కూటర్ ర్యాలీ

భాకరాపేట : జగనన్న సంక్షేమాభివృద్ధికి జనం జేజేలు పలుకుతున్నారని చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గడపగడపకు మహా పాదయాత్రకు చిన్నగొట్టిగల్లు మండలానికి గురువారం విచ్చేసిన ఆయనకు భాకరాపేట ఘాట్ రోడ్డులో భారీగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీపీ యుగంధర్‌రెడ్డి భారీ స్కూటర్ ర్యాలీతో దేవరకొండ శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వరకు తీసుకెళ్లారు. స్వామి వారిని దర్శించుకుని గడపగడపకు మహా పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి నేరుగా సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా పాలన సాగుతోందన్నారు.

భారీ బైక్ ర్యాలీ

తుమ్మలగుంట నుంచి వచ్చిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి చిన్నగొట్టిగల్లు మండలం నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘాట్‌రోడ్డుకు ఎదురెళ్లి స్వాగతం పలికారు. అక్కడి నుంచి దేవరకొండ ఆలయం వరకు స్కూటర్ ర్యాలీ సాగింది. యువత ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

జన నీరాజనం

గడప గడపకు వెళ్లిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి మహిళలు బ్రహ్మరథం పట్టారు. కరోనా సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అందించిన మందులు, పండ్లు, కూరగాయలను మోహిత్‌రెడ్డితో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యగంధర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, సర్పంచ్ విజయ్‌కుమార్, జెట్పీటీసీ స్వరూప, డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, ఉపసర్పంచ్ ప్రదీప్, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు సుధాకర్, సచివాలయ కన్వీనర్ గిరి తదితరులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,320
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,566

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,400
రిటైల్ వెండి గ్రాము	రూ.78.40

ట్రాక్టర్, బైక్ ఢీ.. మహిళ మృతి

ఓజిలి: మండల పరిధిలోని మాచవరం గ్రామం రోడ్డు మలుపు వద్ద ట్రాక్టర్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో మహిళ పుచ్చలపల్లి గీతమ్మ(52) మృతి చెందింది. పోలీసులు వివరాల మేరకు.. మాచవరం గ్రామానికి చెందిన పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, భార్య గీతమ్మ భార్యాభర్తలు. గురువారం ఇద్దరూ ఇంటి నుంచి గ్రామసమీపంలో ఉన్న మామిడి తోటలోకి బైక్‌పై వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామంలోకి తిరిగే మలుపు వద్ద నాయుడుపేటకు యామాయిల్ లోడుతో వెళ్లున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గీతమ్మపై ట్రాక్టర్ వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందింది. నాయుడుపేట సీఐ సోమయ్య, దొరవారిసత్రం ఎస్ఐ తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుండెపోటు సమస్య పెరిగింది



హాజరైన వైద్యులు, సిబ్బంది



మాట్లాడుతున్న డాక్టర్ ప్రేమ్ పైస్

తిరుపతి తుడా: గుండెపోటు సమస్య ఇటీవల కాలంలో పెరిగిందని, దానికి గల కారణాలను ఇప్పటికే గుర్తించామని బెంగళూరుకు చెందిన సెయింట్ జాన్స్ మెడిసిన్ కాలేజీ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రేమ్‌పైస్ తెలిపారు. ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి జనరల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో ఐసీఎమ్మార్ సహకారంతో స్టెమి ప్రాజెక్టులో భాగంగా ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాథమిక గుండెపోటు వచ్చిన క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎదుర్కోవాల్సిన పరిస్థితులు, సకాలంలో అందించాల్సిన మందులపై శిక్షణ ఇచ్చారు. ఐసీఎంఆర్ నిబంధన మేరకు వీటిపై ఇప్పటికే శిక్షణ పొందిన నిపుణుల ద్వారా ఇక్కడ వైద్యులకు శిక్షణ ఇప్పిస్తున్నట్టు వెల్లడించారు. ఐసీఎంఆర్ సైంటిస్ట్ డాక్టర్ మీనాక్షిశర్మ మాట్లాడుతూ ముందుగా గుండెపోటుకు గల కారణాలు, పరిస్థితులను అంచనా వేసుకోవాలన్నారు. ప్రాథమిక లక్షణాల క్రమంలో సరైన చికిత్స అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయని చెప్పారు. ఇందుకు అవసరమైన టెనెక్ట్ ప్లేస్ మందులను రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆసుపత్రులకు సరఫరా చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీ ఎయిమ్స్ ఇన్వెస్టిగేటర్ ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణన్, సైంటిస్టులు డాక్టర్ నేగి, డాక్టర్ ప్రగ్య పాల్గొన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, ఎస్వీ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ మునీశ్వరరెడ్డి, డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి, డాక్టర్ తులసీరామ్, డాక్టర్ పి.వెంకట హరీష్, 13 కమ్యూనిటీ హెల్త్ సెంటర్స్ జిల్లా అధికారులు, ఏరియా ఆస్పత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో గవర్నర్



జార్ఖండ్ గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం జార్ఖాండ్ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం అందించగా , ఎమ్మెల్యే, ఆలయ అధికారులు స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

జేటీసీగా బసిరెడ్డి బాధ్యతల స్వీకరణ

తిరుపతి మంగళం : తిరుపతి రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా మల్లెపల్లి బసిరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా కేంద్రంలో జేటీసీ కార్యాలయం ఏర్పాటు చేసే వరకు తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయం నుంచే జేటీసీగా విధులు కొనసాగించనున్నారు. ఈమేరకు బసిరెడ్డిని తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి సీతారామిరెడ్డి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

11 నుంచి సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నీ



టోర్నమెంట్ ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఏఎల్‌సీఎం మైదానంలో మే 11 నుంచి 14వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు 2వ సారి సౌత్ ఇండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు కాళహస్తి భవన్‌అనుదీప్, కోచ్ గౌస్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం టోర్నమెంట్స్ వివరాలను వెల్లడించారు. ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రలకు చెందిన పలు జట్లు పాల్గొంటాయని, పోటీల్లో వరుస విజేతలుగా నిలిచిన జట్లకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.30 వేలు నగదు బహుమతులను ప్రకటించినట్లు పెర్కొన్నారు. క్రీడాకారులకు భోజనం, వసతి సైతం కల్పించనున్నట్లు నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ నిర్వాహకులు ఏలీషా, హాసన్ వెల్లడించారు. వివరాలను 99666 86283, 97040 79598 నంబర్లలో ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పారు.

టీటీడీకి రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

తిరుపతి తుడా: ఒడిశాకు చెందిన శివం కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ గురువారం శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి 10 లక్షల వెయ్యి రూపాయల విరాళాన్ని అందించింది. మహతి ఆడిటోరియంలో గురువారం ఆ సంస్థ తిరుపతి ప్రతినిధి రాఘవేంద్ర ఇందుకు సంబంధించిన డీడీని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్



విద్యార్థినులతో ఇన్‌చార్జ్ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో గురువారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ జరిగింది. ఆ వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థినులు పలు సంస్థల్లో ఉద్యోగావకాశాలు సాధించిన నేపథ్యంలో ఏర్పాటుచేసిన ఈ మీట్‌కు ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు వివిధ బహుళజాతి సంస్థల్లో ఒకటి అంతకుమించి ఉద్యోగావకాశాలు సాధించడం వారి ప్రతిభకు నిదర్శనమన్నారు. కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఆధ్వర్యంలో వివిధ కంపెనీ ప్రతినిధులతో విద్యార్థినులకు అవసరమైన నైపుణ్యం అందిస్తుండడంతో ఇది సాధ్యమైనట్లు వివరించారు. అనంతరం విద్యార్థినులను అభినందించారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రజని, ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, ప్లేస్‌మంట్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఆర్.ఉష పాల్గొన్నారు.

పేదింట.. మార్కుల పంట



కావ్య



ప్రియాంక

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): ఇంటర్ పరీక్షా ఫలితాల్లో బాలాయపల్లి మండలం వెంగమాంబపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ ఎంపీసీలో కె కావ్య 890 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో బి ప్రియాంక 470కి 418 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది.

గురుకులంలో సత్ఫలితాలు

చిల్లకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తెలిపారు. జూనియర్ ఇంటర్‌లో ఎంపీసీ విద్యార్థి జీ కిరణ్‌కుమార్ 470 మార్కులకు 422 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారన్నారు. అలాగే బైపీసీ విద్యార్థి అందలమాల చందు 388 మార్కులు సాధించాడన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో కోగిలి హరికృష్ణ వెయ్యికి 969 మార్కులు సాధించి టాపర్‌గా నిలవగా, కే హేమంత్ 940, డీ గణేష్ 920, పీ యశ్వంత్ 915, కే వెంకట్ 914 మార్కులు సాధించారన్నారు.. బైపీసీలో బీ బానుప్రకాష్ 920 మార్కులతో టాపర్‌గా నిలిచాడు.

అత్యుత్తమ ఫలితాలు



అఖిల



శైలు

పెళ్లకూరు: ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. మండలంలోని నందిమాల గ్రామానికి చెందిన మైలారి రమేష్ చిన్న కుమార్తె అఖిల, చిల్లకూరు దళితకాలనీకి చెందిన కరాటి పార్వతి కుమార్తె శైలు ఇంటర్ బైపీసీ గ్రూపులో వెయ్యి మార్కులకు అఖిల 967 మార్కులు, శైలు 962 మార్కులు సాధించారు. వీరిని కళాశాల అధ్యాపకులు అభినందించారు. శైలు తండ్రి శివ 18 ఏళ్ల కిందట భార్య, ముగ్గురు పిల్లలను వదిలి వెళ్లిపోగా తల్లి పార్వతి కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటోంది.


సత్తా చాటిన బాలికలు



ఎస్ సురేఖ


కలువాయి: ఇంటర్ ఫలితాల్లో కలువాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన సీనియర్ ఇంటర్ బైపీసీ విద్యార్థులు ఎస్ సురేఖ వెయ్యికి 959 మార్కులు, పి నందిని 936 మార్కులు, భారతి 928 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం జోష్ణవి 470కి 412 మార్కులు, షేక్ సమీర 385 మార్కులు సాధించారు.

కెమికల్ ఇంజినీరింగ్ చేస్తా



నాపేరు కోగిలి హరికృష్ణ. మాది దామానెల్లూరు గ్రామం. తల్లిదండ్రులు కోగిలి పెంచలయ్య, రమణమ్మ కలీలు. వారికి నేను ఒక్కడే కొడుకు. తిరుపతి జిల్లా చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఇంటర్ చదువుతున్నా. ఎంపీసీలో 969 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం గుంటూరు జిల్లా అడవి తక్కెళ్లపాడు గురుకుల కళాశాలలో సమ్మర్ కోచింగ్‌లో ఉన్నా. కెమికల్ ఇంజినీరింగ్ చేయలన్నదే ధ్యేయం.

ఉన్నత విద్యే లక్ష్యం



రాపూరు: ఉన్నత చదువులు చదవడమే తన లక్ష్యమని ఇంటర్ టాపర్ మహిత తెలిపారు. మండలం కండలేరులోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల్లో సీనియర్ ఇంటర్ ఎంఈసీ గ్రూపులో మహిత వెయ్యికి 960 మార్కులు సాధించింది. నెల్లూరు జిల్లా టీపీ గూడూరు మండలం, పాత కోడూరు గ్రామానికి చెందిన మహిత తండ్రి పేట నాగరాజు ఆటో డ్రైవర్ కాగా, తల్లి మంజుల గృహిణి.